లక్ష్మీ నృసింహుడికి తిరుకల్యాణోత్సవం

వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 23 : స్థానిక లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయ వెలుపలి మండపంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను నిర్వహించి నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలను ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. కార్తిక మాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొన్నది. దీపారాధన, వ్రత మండపాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖాజానాకు రూ. 42,98,152 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

దివ్యాంగులు సాధించలేనిది ఏదీ లేదు : ఏసీ గంగాధర్

దివ్యాంగుల ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కె.గంగాధర్

భువనగిరి అర్బన్, నవంబర్ 23 : దివ్యాంగులు ఏ విషయంలోను తక్కువ కాదని, వారు సాధించలేనిది ఏదీ లేదని అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి స్పోర్ట్స్ మిట్‌లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో 10 నుంచి 17 ఏండ్ల బాల, బాలికలకు, 18 నుంచి 54 ఏండ్ల వరకు గల స్త్రీ, పురుష దివ్యాంగులకు రన్నింగ్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్ క్రీడా పోటీలను శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, హెచ్ఎం రవికుమార్, దివ్యాంగులు, పీఈటీలు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకాలి : రమేశ్

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, నవంబర్ 23 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 25న తుంగతుర్తి నియోజకవర్గంలోని అర్వపల్లి మీదుగా మహబూబాద్‌లో జరిగే గిరిజన ధర్నాకు వెళ్తున్నందున మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలుకాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను శనివారం రమేశ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ శాఖ ముఖ్య నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ సోంమల్లు, గజ్జి మల్లేశ్, గనగాని శ్రీశైలం, మల్లం సైదులు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపయోగంగా గొర్రెల మార్కెట్ యార్డు

నిరుపయోగంగా ఉన్న గొర్రెల మార్కెట్ యార్డ్ షెడ్డు

చౌటుప్పల్, నవంబర్ 23 : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్ల సింగారం రోడ్డు సమీపంలో రూ.50లక్షలతో గొర్రెల మార్కెట్ యార్డ్ షెడ్డును నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ నిధుల నుంచి ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. గొర్రెల క్రయవిక్రయాల కోసం దీన్ని ఏర్పాటు చేయగా.. ప్రారంభించి ఏడాది కావొస్తుంది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎదుట ప్రతి ఆదివారం సంత జరిగేది. ఆ సంతలో మూగజీవాలకు ఇబ్బందులు కలుగకుండా పట్టణానికి దూరంగా సంతకు ప్రత్యామ్నాయంగా ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో అటువైపు ఎవరూ వెళ్లడం లేదు. షెడ్డు ఇప్పుడు నిరుపయోగంగా మారిందని, అన్ని సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈనెల 26న నిరసనలను జయప్రదం చేయాలి : జీవన్‌రెడ్డి

నిరసనను జయప్రదం చేయాలని అభివాదం చేస్తున్న నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 23 : కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నవంబర్ 26న జరిగే దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్ రెడ్డి అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, జాయింట్ ఫ్లాట్ ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్త కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 26న జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి బాబుజగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు జరిగే ర్యాలీలో ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎండీ.ఇమ్రాన్, కల్లూరి మల్లేశం, కొల్లూరి రాజయ్య, గోరేటి రాములు, దాసరి పాండు, మాయ కృష్ణ, సామల శోభన్‌బాబు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని వినతి

డీఏఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్, నవంబర్ 23 : పట్టణంలోని పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఇరువైపులా సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. చెరువు అలుగు పోస్తే వరదనీరు సాఫీగా వెళ్లేలా నిర్మాణం చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు. పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు, ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం : మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, నవంబర్ 23 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని బంగారిగడ్డలో నూతనంగా నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, కన్సల్టెంట్ ఇంజినీర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామీజీలకు పాదపూజ

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 23 : పట్టణ కేంద్రంలోని భక్తాంజనేయ ఆలయంలో సంపూర్ణానందగిరిస్వామి, ప్రకాశానంద సరస్వతీ స్వాములకు శనివారం దేవాలయ ప్రతినిధులు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ కడవేరు వెంకటేశం, ప్రతినిధులు దోర్నాల కరుణాకర్, మిరియాల వెంకటేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్ర ఆహారాన్ని అందించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోటకొండూర్ : బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

మోటకొండూర్, నవంబర్ 23 : ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు అందించే ఆహారంలో పరిశుభ్రత పాటించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. మోటకొండూర్ మండలంలోని బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న పప్పు, బియ్యం, గుడ్లు, కూరగాయాలు, పాలప్యాకెట్ వ్యాలిడిటీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువ కాలం నిల్వ ఉంచిన, పురుగులు పట్టిన, డేట్ అయిపోయిన సరుకులను వాడొద్దని సిబ్బందికి సూచించారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. వంట వండే ప్రదేశం, విద్యార్థులకు వడ్డించే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మొలకలతో తయారు చేసిన రాగిజావను రుచి చూశారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, మోటకొండూర్ డీటీ జయలక్ష్మి, ప్రిన్సిపాల్ జ్యోతి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ స్వాతి అధికారులున్నారు.

గుండాల : కేజీబీవీలో వంటగదిలోని కూరగాయలను పరిశీలిస్తున్న తాసీల్దార్ జల కుమారి

ఆత్మకూరు(ఎం) : కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

నీళ్ల చారు.. పలుచటి కూరలు

రాజపేట : మండలంలోని రఘునాథపురం జడ్పీహెచ్ఎస్‌ను శనివారం మండల ప్రత్యేకాధికారి జింకల శ్యాంసుందర్, ఎంపీఓ ఆవుల కిషన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నీళ్ల చారు, కూరలు పలుచగా ఉన్నాయని అధికారులు అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్ఎం మనోజ్ కుమార్ ఉన్నారు.

గుండాల : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల హాస్టళ్లను శనివారం తాసీల్దార్ జల కుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి, ఆర్ఐ అనసూర్య ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని కేజీబీవీలో మండల ప్రత్యేకాధికారి రాజారాం అకస్మిక తనిఖీ చేయగా, తాసీల్దార్ రవికుమార్ ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను సందర్శించారు. కేజీబీవీలో రాజారాం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వారి వెంట ఎంపీడీఓ రాములునాయక్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు తదితరులున్నారు.

తుర్కపల్లి : మండలంలోని రుస్తాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేకాధికారి గుర్రం సురేశ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి, వంట గదులు, మరుగుదొడ్లను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని తాసీల్దార్ మహేందర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, వార్డెన్ కరుణ శ్రీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : డిప్యూటీ డీఎంహెచ్ఓ

చౌటుప్పల్ : పరిసరాల పరిశ్రుభత ప్రతి ఒక్కరూ పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం మోడల్ స్కూల్‌ను శనివారం ఆమె సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట మండల మెడికల్ ఆఫీసర్ సీహెచ్ కాటం రాజు, ప్రిన్సిపాల్ హజారయ్య, కేర్ టెకర్ మల్లిక, వైద్యులు జయంత్, శివకుమార్, సౌజన్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ఆకస్మిక తనిఖీ

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

యాదగిరిగుట్ట, నవంబర్ 23 : పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ రమేశ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందిని విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కేసుల వివరాలు, వాటి లిస్టును పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పట్టణ సీఐ రమేశ్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఆస్తి వివాదం.. రెండ్రోజులు నిలిచిన తండ్రి అంత్యక్రియలు

బాలయ్య మృతదేహం

మోత్కూరు, నవంబర్ 23 : ఆస్తి వివాదంతో తండ్రి దహన సంస్కారాలను రెండ్రోజుల పాటు అడ్డుకున్న హృదయ విదారక ఘటన మండలంలోని సదర్శాపురంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలయ్య(62) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతిడికి భార్య లింగమ్మ, కుమారులు నరేశ్, సురేశ్, కుమార్తెలు శోభ, సోని ఉన్నారు. అందరికీ పెండ్లిళ్లు అయ్యాయి. కాగా తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో బాలయ్య తన భార్య సోదరుడు రాములుతో కలిసి 3 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. అందులో అరెకరం విక్రయించాడు. మిగిలిన 2.20 ఎకరాల భూమిలో బాలయ్య వాటకు చెందిన ఒక ఎకరం 10 గుంటల భూమిని భార్య లింగమ్మ తన పెద్ద కొడుకు నరేశ్, భార్య అరుణకు పట్టా చేశారు. దీంతో చిన్న కొడుకు సురేశ్ ఆ భూమిలో తనకు రావాల్సిన వాటా కోసం అభ్యంతరం తెలిపాడు. తనకు రావాల్సిన భూమిని తన పేరున పట్టా చేసిన తర్వాతే తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు జరుపుదామని రెండ్రోజుల పాటు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం గ్రామానికి చేరుకొని గ్రామ పెద్దలతో చర్చలు జరిపారు. ముందు దహన సంస్కారాలు జరుపాలని ఎస్ఐ డి.నాగరాజు తెలుపడంతో పెద్ద కొడుకు నరేశ్ తలకొరివి పెట్టి అంత్యక్రియలు చేశారు.

సంప్రదాయ వంటల్లో పోషకాలు అధికం : ఎంపీడీఓ

ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి

తుర్కపల్లి, నవంబర్ 23 : సంప్రదాయ వంటల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్‌జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ వంటకాలను రుచి చూసి, బహుమతులు అందించారు. అదే విధంగా మీకు నచ్చిన ఆదివాసీ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు బల్ల ఉపేందర్‌రావు, శ్రీనివాస్‌చారి, బిక్షమయ్య, సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి సంచారం

- పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూరు(ఎం) : రహీంఖాన్‌పేటలో సంచరిస్తున్న వ్యక్తి

ఆత్మకూరు(ఎం), నవంబర్ 23 : మండలంలోని రహీంఖాన్‌పేటలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి సంచరిస్తుండడంతో భయాందోళనకు గురైన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ ఆంజనేయులు వెంటనే గ్రామానికి చేరుకొని అనుమానిత వ్యక్తిని పట్టుకొని విచారించగా తాను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తినని హిందీ భాషలో తెలిపాడు. దీంతో ఆ ఆయన్ను పోలీస్‌స్టేషన్‌కు తరలించాక మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి శనివారం రాయిగిరిలోని ఆశ్రమంలో చేర్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

దివీస్ సేవలు అభినందనీయం

- డీఈ కృష్ణారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 23 : వ్యవసాయ, గ్రామాల అభివృద్ధికి సాయం చేస్తున్న దివీస్ కంపెనీ సేవలు అభినందనీయమని ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి అన్నారు. కంపెనీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులతో మండల పరిధిలోని బండి రావిరాల గ్రామం నుంచి పంతంగి వరకు గుర్రపు డెక్క ఆకు తొలగించి, పిలాయిపల్లి కాల్వ పూడికతీత పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, నాయకులు బొబ్బల బాలకృష్ణారెడ్డి, బోయపల్లి పురుషోత్తంరెడ్డి, కూసుకుంట్ల ఆయిల్ రెడ్డి, దివీస్ అధికారి గోపి, వెంకటేశ్వర్లు, ఇంజినీర్ తరుణ్ తేజ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చౌటుప్పల్, నవంబర్ 23 : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ఎన్‌హెచ్65 వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి పట్టణంలోని మల్లికార్జున నగర్‌కు చెందిన దొంతభక్తుని రాజారావు(62) హైదరాబాద్‌లోని తన కూతురు దగ్గరకు భార్యతో కలిసి వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి రాజమండ్రికి ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. మార్గమధ్యంలో లక్కారం తాజా టిఫిన్ సెంటర్ వద్ద బస్సు ఆపగా.. రాజారావు మూత్రవిసర్జన కోసం రోడ్డు అవతలి వైపు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజారావుకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రజక సంఘం జిల్లా సదస్సును విజయవంతం చేయాలి : వెంకటేశ్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 23 : ఈనెల 26న భువనగిరిలోని పెన్షనర్స్ భవన్‌లో జరుగనున్న తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ వడ్డెబోయిన వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు కూరెళ్ల, పల్లెర్ల గ్రామాల్లో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశాల్లో ఆయన హాజరై మాట్లాడారు. నాయకులు మురళీకృష్ణ, సత్యనారాయణ, మల్లయ్య, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటి ప్రచారం

ఆలేరు టౌన్, నవంబర్ 23 : డిసెంబర్ 15న చౌటుప్పల్‌లో జరిగే సీపీఎం 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణ కేంద్రంలోని కాటమయ్య బస్తీలో పార్టీ శ్రేణులు శనివారం ఇంటింటి ప్రచారం చేసి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, మొరిగాడి రమేశ్, ఎండీ ఖలీల్, మొరిగాడి అంజయ్య, రాజు, భాగ్య, ఘనగాని భాగ్యమ్మ, సీసా కౌసల్య ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన సుజిత్‌రావు

ఎమ్మెల్సీ కవితతో సీహెచ్.సుజిత్‌రావు

భువనగిరి అర్బన్, నవంబర్ 23 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 22న జాగృతి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో భువనగిరి పట్టణానికి చెందిన సీహెచ్.సుజిత్ రావు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో కమిటీలు వేసుకుని ప్రజలపై జరుగుతున్న మోసాలపై ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజల పక్షాన నిలబడాలని, ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టాలని కవిత పిలుపునిచ్చినట్లు సుజిత్‌రావు చెప్పారు.

ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వ విప్‌కు వినతి

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఆలేరు టౌన్, నవంబర్ 23 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు శీతాకాలం అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటింపజేయాలని డివిజన్ సాధన పోరాట కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో కమిటీ సభ్యులు అయిలయ్యను కలిసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి డిమాండ్ లేని ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఎలా ప్రకటించారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల భారీ బహిరంగ సభలో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అయిలయ్యను గెలిపిస్తే 100 రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గెలిపిస్తే రెవెన్యూ డివిజన్ చేస్తానని మేనిఫెస్టోలో కూడా బీర్ల అయిలయ్య తెలిపారని వారు అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చక పోతే రానున్న రోజుల్లో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించడానికి కృషి చేస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో కన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేశ్, ఎండీ సలీం, పద్మాసుదర్శన్, కేమిడి ఉప్పల్లయ్య, పాల్గొన్నారు.

చెక్ డ్యాం పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట, నవంబర్ 23 : మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో వాగుపై రూ.1.65 కోట్ల నిధులతో నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులో నీళ్లు వృథాగా పోకుండా ఉండేందుకు చెక్ డ్యాం ఉపయోగపడుతుందన్నారు. మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, ఇరిగేషన్ డీఈఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

భువనగిరి అర్బన్ : పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల

రాజాపేట, నవంబర్ 23 : మండల కేంద్రంలోని ఎస్‌వీ గరుడ్రాది ఎస్టేట్‌లో ఎస్ఎస్‌వీ గ్రూప్ ఆఫ్ బిల్డర్ డెవెలపర్స్ ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మశ్రీ భార్గవ్ గురుస్వామి, పుల్లూరు ఉపేందర్ గురుస్వామి సమక్షంలో అయ్యప్ప మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో రాజాపేట మాజీ సర్పంచులు ఊట్కూర్ అశోక్ గౌడ్, సోమసాని రాజ మల్లయ్య, సంధిల భాస్కర్ గౌడ్, పులిగిల్ల నరసింహులు, బెజగం రాజేశ్వర్ గుప్తా పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణ పరిధిలోని శబరినగర్‌లో గల హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మహాపడి పూజ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిపారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నరేంద్రశర్మ, అన్నదాతలు చెన్న స్వాతిమహేశ్, కరిపే మనీశ్, ఇంకోలు సురేందర్, పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కృషి ఎనలేనిది : పల్లె రవికుమార్ గౌడ్

రక్తదాన శిబిరంలో పాల్గొన్న పల్లె రవికుమార్ గౌడ్

చౌటుప్పల్, నవంబర్ 23 : నిరుపేదలకు నాణ్యమైన విద్య అందించడంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కృషి ఎనలేనిదని కల్లుగీత కార్పొరేష